
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
ఆదివారం 26 అక్టోబరు 2025
జిల్లాల వార్తలు



గీతకార్మికులు, కల్లు ప్రియులు తాటిచెట్లకు పెట్టిన ఆసక్తికరమైన పేర్ల గురించి వింటే ఆశ్చర్యపోవాల్సిందే. సాధారణంగా మనుషులకు జన్మ నక్షత్రం, పుట్టిన సమయాన్ని బట్టి పేర్లు పెట్టినట్లుగానే, తరతరాలుగా తాటి చెట్లకు వాటి ఆకృతి, స్థలం, కల్లు రుచిని బట్టి తీరొక్క పేర్లు పెట్టి పిలుస్తున్నారు. దేవుళ్లు, సినిమాలు, పలు కులాలు, భూయజమానుల పేరిట పిలుస్తుంటారు. ఈ విలక్షణ సంస్కృతి దుబ్బాక మండలంలోనే కాకుండా, గీత కార్మికులు, కల్లు ప్రియులు ఉండే చాలా ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటుంది.

మోర్గి వంతెనకు మోక్షం ఎప్పుడో?



రూ. 6.32 కోట్లు మంజూరు
మూడేళ్ల క్రితం ప్రారంభించిన పనులు పిల్లర్ల దశకే పరిమితం
నాణ్యత లోపించిందని కట్టిన పిల్లర్ల కూల్చివేత
మళ్లీ ఎప్పుడు కడతారో తెలియని అయోమయం
రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

7

సండే స్పెషల్



పేరెట్టి ముద్దుగా పిలిచెట్టు

తాటిచెట్లకు ఆసక్తికర పేర్లు

గీత కార్మికులు, కల్లు ప్రియుల వినూత్న నామకరణ సంస్కృతి
రుచి, ఆకృతి, స్థలాన్ని బట్టి విభిన్న నామధేయాలు
పటేల్‌తాడు, కోడెనాగు, బంగారు తీగ.. ఎన్నో పేర్లు

7



నిర్మాణం.. నిర్వాకం

నాలాలు, రోడ్లను అక్రమించి అడ్డదిడ్డంగా నిర్మాణాలు

వరద, మురుగు ముందుకు వెళ్లలేని దుస్థితి
వానొస్తే నీట మునుగుతున్న కాలనీలు
జలమయమవుతున్న జహీరాబాద్

జహీరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో నిర్మాణ రంగం, పట్టణ ప్రణాళికా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. జిల్లా టౌన్ ప్లానింగ్ అనుమతుల ముసుగులో వెంచర్ల నిర్వాహకులు, అధికారులు క్షేత్రస్థాయిలో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. అనుమతుల ప్రక్రియ ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉండగానే యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టడం, క్రయవిక్రయాలు చేయడం నిత్యకృత్యమైంది.

జోరుగా నిర్మాణాలు

జహీరాబాద్‌కు నిమ్జ్ రావడంతో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. పట్టణంలో అధికారికంగా 50 వెంచర్లు ఉంటే, అనధికారికంగా మరో 50 వరకు ఉన్నాయని అంచనా. అలాగే, అనధికారిక అక్రమ భవన నిర్మాణాల సంఖ్య కూడా భారీగా ఉంది. మున్సిపల్ అధికారుల వద్ద వెంచర్లకు సంబంధించిన పత్రాలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం.

యథేచ్ఛగా ఆక్రమణలు

టౌన్‌ప్లానింగ్, డీటీసీపీ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాలాలు, మురుగు కాలువలు ఇరుకుగా మారాయి. పదికిపైగా ఉన్న ప్రధాన నాలాలను కొందరు ఆక్రమించి, వాటిపై నిర్మాణాలు చేపట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. బఫర్ జోన్ నిబంధనలు పట్టణంలో అమలు కావడం లేదు. హోతి(బి) మీదుగా డ్రీమ్‌వెల్లీ కాలనీ వైపు వచ్చే వాగుతో పాటు పెద్దమ్మ గుడి, హౌజింగ్‌బోర్డు, మూసానగర్, ఎన్‌జీవోస్ కాలనీ,



జహీరాబాద్ పట్టణంలో లిక్కర్‌కోర్టు సమీపంలో కబ్జాకు గురై కుంచించుకుపోయిన నాలా

చెన్నారెడ్డి నగర్, ఆదర్శనగర్, ఇంద్రప్రస్థాన్, భరత్‌నగర్ వంటి ప్రాంతాల్లోని ప్రధాన నాలాలపైనా కబ్జాలు అధికమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం, నాలాలపై కబ్జాల కారణంగా వర్షపు నీరు, మురుగు నీరు ముందుకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. చిరుజల్లులు కురిసినా రోడ్లు అధ్వానంగా మారి, నీరు నిలిచిపోతోంది. వర్షాలు తీవ్రమైనప్పుడు వరదనీరు ముందుకు పోవడానికి వీలులేక డ్రీమ్‌వెల్లీ, వసంతవిహార్, ఇంద్రప్రస్థాన్ తదితర కాలనీలు నీట మునుగుతున్నాయి. వరద వచ్చినప్పుడు అధికారులు హడావుడి చేయడం, తర్వాత పట్టించుకోకపోవడం జరుగుతోంది.

ఇరుకైన రోడ్లు

వరద ప్రవాహం, రోడ్లపైకి వ్యాపారాలను విస్తరించడం, వాహనాలను నిలపడం, అక్రమ నిర్మాణాల కారణంగా పట్టణంలోని ప్రధాన రహదారులు ఇరుకుగా

మిగతా 8వ పేజీలో



పట్టణంలోని మూసానగర్-ఆంధ్రాబ్యాంకు పక్క నుంచి వచ్చే నాలాపై అక్రమ నిర్మాణాలు

అనుమతులు రెండంతస్థులకు.. కట్టింది ఆరంతస్థులు

అనుమతుల మంజూరులో రాజకీయ జోక్యం
అధికారుల వసూళ్ల పర్వం
ప్రభుత్వ ఆదాయానికి గండి

పటాన్‌చెరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మండలంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీల నుంచి రెండంతస్థులకు అనుమతులు తీసుకొని ఆరంతస్థులు నిర్మిస్తున్నారు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఫీజు చెల్లించకుండా అక్రమ అంతస్థులను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామం ఇటీవల మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. పంచాయతీగా ఉన్న సమయంలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు జీ+2 వరకు అనుమతులు మంజూరు చేసి, ఇందుకు తగినట్టుగా స్థలం విస్తీర్ణాన్ని బట్టి ఫీజులు వసూళ్లు చేశారు. అయితే కొందరు అదనంగా నాలుగు అంతస్థుల వరకు నిర్మించారు. ఇప్పటికే 120 అక్రమ నిర్మాణాలు వెలిసినట్టు అధికారులు లెక్కతేల్చారు.

అధికారుల అండదండలు

ప్రభుత్వ ఆదాయానికి గండిపడినా అధికారులు మాత్రం సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఒక్కో అనుమతికి రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు వసూలు చేసినట్టు తెలిసింది. స్థలం వివాదంలో ఉంటే మరింత ఎక్కువ వసూలు చేసినట్లు చెప్పుకుంటున్నారు. వీరికి స్థానిక ప్రజాప్రతినిధులు అండగా నిలుస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఓ వెంచర్ విషయంలో ప్రభుత్వస్థలంలో రోడ్డు వేసినా ఇంటి అనుమతులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. రోడ్డు సమస్యను దగ్గరుండి పరిష్కరించిన రెవెన్యూ అధికారులు ఇందుకు రూ. లక్షల్లో వసూలు చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఓ పార్కు స్థలంలోనూ నాలుగు అంతస్థులకు అనుమతులిచ్చిన విషయంపై ఫిర్యాదులు రాగా మాజీ సర్పంచ్ కల్పించుకొని చర్యలు తీసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని తెలుస్తున్నదని. చెరువుల కాలువల మూసివేసి చేపట్టిన నిర్మాణాలకు సైతం అనుమతులు ఇచ్చారు.

రోడ్డు వేస్తున్నామంటూ వసూళ్లు

అక్రమాలను నిలదీయాల్సిన ప్రజాప్రతినిధులు అక్రమార్కులకు అండగా నిలిచి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంద్రేశం నుంచి పెద్దకంజర్ల వైపు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డును బాగుచేసేందుకు స్థానిక నాయకులు బిల్డర్ల నుంచి రూ. లక్షల్లో



ఇంద్రేశంలో నిర్మాణంలో ఉన్న భవనం

వసూళ్లు చేస్తున్నారు. ఇప్పటికే రూ. 60లక్షలకు పైగా వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇవ్వలేమని చెప్పిన చిన్న బిల్డర్లను అక్రమ అంతస్థులు కూలుస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

పాత అనుమతులపై నిషేధం

ఇంద్రేశం మున్సిపాలిటీగా ఏర్పడినందున గతంలో తీసుకున్న పంచాయతీ అనుమతులపై నిషేధం కొనసాగుతుంది. ఎవరికి వారు నిర్మాణాలు చేయడం వల్ల అభివృద్ధి ప్రణాళిక దెబ్బతింటోంది. రోడ్డు వెడల్పును బట్టి అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది. గతంలో అవేమీ పరిగణలోకి తీసుకోలేదు.

-మధుసూదన్‌రెడ్డి, కమిషనర్
ఇంద్రేశం మున్సిపాలిటీ

రక్తదానం చేయండి..

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



రక్తదానం చేస్తున్న సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కృత్రిమంగా తయారు చేయలేని రక్తానికి ఉన్న విలువ దేనికీ లేదని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాస్టర్ డిగ్రీ కాలేజ్‌లో పోలీసులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలను ఆయన పరిశీలించారు. 61 మంది హాజరైన ఈ పోటీల్లో ఉత్తమంగా నిలిచిన మూడు వ్యాసాలకు రాష్ట్రస్థాయికి పంపిస్తామని ఎస్పీ తెలిపారు. అలాగే, పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్‌స్పెక్టర్లు రమేష్, కిరణ్‌కుమార్, సదా నాగరాజు, ప్రవీణ్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, మెడికల్ అధికారి వెంకటరామ్, పోలీస్ డాక్టర్ జ్యోతి, ఆర్ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, డానియెల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై కొరడా

ముత్తంగా ఓఆర్ఆర్ వద్ద ఆర్టీఏ, విజిలెన్స్ తనిఖీలు



ముత్తంగి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

సంగారెడ్డి క్రైం/పటాన్‌చెరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇష్టారాజ్యంగా తిరుగుతున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణాశాఖ, విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. 'ప్రైవేట్ ట్రా'హెల్' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించి వాహనాలను తనిఖీ చేశారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద అవుటర్ రింగురోడ్డు ఎగ్జిట్ వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. డ్రైవర్ లైసెన్సులు, బస్సుల ధ్రువపత్రాలు, ఫిట్‌నెస్ క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం 17 బస్సులు తనిఖీలు చేయగా అందులో 14 బస్సుల్లో నిబంధనలను అనుసరించి మార్పులు చేసుకోవాలని హెచ్చరించి జరిమానా విధించారు. మూడు బస్సులు సీజ్ చేశారు.

'హరేకృష్ణ' గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం

- అక్షయపాత్ర ద్వారా రోజూ 23 లక్షల మంది పౌష్టికాహారం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హరేకృష్ణ కల్చరర్ సెంటర్ గొప్ప ఆధ్యాత్మిక కేంద్రమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కందిలోని అక్షయపాత్ర ఫౌండేషన్ వద్ద కల్చరల్ సెంటర్ నిర్మాణంలో భాగంగా నిర్వహించిన మహా నరసింహ హోమం, గర్భాలయ యంత్ర స్థాపనపూజలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ వాహనాలను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అక్షయ పాత్ర ఫౌండేషన్ నిర్వహిస్తున్న అతిపెద్ద కిచెన్‌ను పరిశీలించారు. హరేకృష్ణ ఫౌండేషన్ మన మహోన్నత సాంస్కృతిక వారసత్వాన్ని ప్రాచుర్యంలోకి తెస్తోందని పేర్కొన్నారు. రోజూ 23 లక్షల మంది ఆకలి తీరుస్తున్న ఘనత అక్షయపాత్రదేనని కొనియాడారు. కార్యక్రమంలో అక్షయపాత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు సత్య గౌరచంద్ర దాస, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎస్పీ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



కందిలోని అక్షయపాత్రలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి జీజీహెచ్ ఘటనపై

ఇద్దరు ప్రొఫెసర్లతో సమగ్ర విచారణ

ఆదేశాలు జారీ చేసిన సూపరింటెండెంట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పితో సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరితే అక్కడ డాక్టర్ల నిర్లక్ష్యంతో చేయి ఇన్ఫెక్షన్‌కు గురై తీసేయాల్సిన పరిస్థితి రావడంపై అధికారులు స్పందించారు. ఈ ఘటనపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'కడుపునొప్పితే పోతే.. ప్రాణం మీదకు' శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించిన సూపరింటెండెంట్ డా.వి.మురళీకృష్ణ విచారణకు ఆదేశించారు. జనరల్ సర్జరీ విభాగాధిపతి, అనస్తీషియా విభాగాధిపతికి విచారణ బాధ్యతలు అప్పగిస్తూ సూపరింటెండెంట్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. సీనియర్ ప్రొఫెసర్లైన వీరిద్దరూ విచారణచేసి వీలైనంత త్వరగా సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు కూడా ఆరా తీసినట్టు తెలిసింది.



రుస్తుంపేటలో నిర్మాణంలో ఉన్న గురుకుల భవనం

భవనం.. భయం..!

- అరకొర వసతులతో గిరిజన గురుకులం
- 500 మంది బాలికల అవస్థలు
- అటవీ ప్రాంతంలో నూతన భవన నిర్మాణం
- భద్రత ప్రశ్నార్థకం

నర్సాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాలికల గురుకులం అంటే అన్ని రకాల సౌకర్యాలతో సురక్షితమైన చోట కొనసాగించాలి. కానీ స్థలం దొరకలేదన్న సాకుతో అనువుగాని చోట అటవీ ప్రాంతానికి సమీపంలో నిర్మానుష్య సంక్షేమ వసతిగృహ భవనాన్ని నిర్మిస్తున్నారు. అది విద్యార్థినులకు ఎంతవరకు సురక్షితమన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నర్సాపూర్ మండలం నారాయణపూర్ సమీపంలోని ఓ అద్దె భవనంలో ఎనిమిది సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ వరకు తరగతులు జరుగుతున్నాయి. 540 విద్యార్థినులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న అద్దె భవనంలో సరిపడా గదులు, సౌకర్యాలు లేక విద్యార్థినులు ఇక్కట్లు పడుతున్నారు. పొలాల పక్కనే ఉండడంతో నిత్యం ఎలుకలు, పాములు, కోతులతో కునుకులేకుండా పోతున్నది. రెండ్రోజుల క్రితం ఎనిమిది మంది విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. సొంత భవనం ఉంటే బాగుంటుందని ఆశిస్తున్న విద్యార్థినులకు నిరాశ తప్పడం లేదు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సొంత భవనం సురక్షితమా అనే సంశయం వ్యక్తమవుతున్నది. గురుకుల పాఠశాల నూతన భవన నిర్మాణానికి ఐదెకరాల స్థలం అవసరం కాగా, మండల కేంద్రానికి సమీపంలో లభించకపోవడంతో మండలంలోని రుస్తుంపేట వద్ద కేటాయించారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతం పక్కనే ఈ స్థలం ఉన్నది. ఇక్కడ నూతన భవన నిర్మాణానికి మూడేళ్ల క్రితం రూ.4కోట్లు మంజూరు చేయగా ప్రస్తుతం నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడికి వెళ్లేందుకు కనీసం రోడ్డు కూడా లేదు. చుట్టూ పొలాలు, అడవి ఉండటంతో ఇక్కడే జరుగుతుందో బయటికి తెలిసే అవకాశం లేదు. గురుకులాన్ని ఇక్కడికి తరలిస్తే రక్షణ ప్రశ్నార్థకంగా మారింది.

గురుకులంలో వైద్యశిబిరం

నర్సాపూర్: నారాయణపూర్ గిరిజన బాలికల గురుకులంలో విద్యార్థినులకు ఎలుక కాట్లకు గురవడంపై అధికారులు స్పందించారు. వైద్యశిబిరం ఏర్పాటుచేసి గాయపడిన విద్యార్థినులకు చికిత్స అందించారు. ఎనిమిది మంది విద్యార్థినులకు ఎలుకలు కరవడమే కాకుండా మరికొందరికి చర్మ సంబంధ సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి చికిత్స చేసినట్లు మెడికల్ ఆఫీసర్ రఘువరన్ బృందం తెలిపారు. విద్యార్థినులకు ఎలుక కాట్ల వార్త తెలిసి నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి హేమలత శనివారం గురుకుల పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు.

బీవీఆర్‌ఐటీని సందర్శించిన చినాబ్ వంతెన రూపకర్త మాధవీలత



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మాధవీలత

నర్సాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రముఖంగా నిలిచిన చినాబ్ వంతెన రూపకర్త(డిజైన్ ప్రొవైడర్) ప్రొఫెసర్ మాధవీలత శనివారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశం నిర్వహించి, చినాబ్ వంతెన నిర్మాణం, దాని ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబేతో పాటు పలువురు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు

కల్హేర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కల్హేర్‌లో మేనమామ వద్ద ఉంటూ చదువుకుంటున్న బాలికను మాయమాటలు చెప్పి తీసుకుపోయిన యువకుడిపై పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. మండల పరిధిలోని రాపర్తి గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువకుడు, తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను లోబరుచుకుని తీసుకువెళ్లాడు. రెండు నెలల క్రితం కల్హేర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్, కిడ్నాప్ కేసు నమోదు కాగా, పోలీసులు వారిని గుర్తించి తీసుకువచ్చారు. యువకుడిపై పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయాధికారి అతనికి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. బాలికల జోలికి వెళ్లినా, ఎవరైనా సహకరించినా జీవితాంతం జైల్లో ఉండాల్సి వస్తుందని యువకులను సీఐ హెచ్చరించారు.

సిగ్నల్ వద్ద ఆగిన బైక్‌ను ఢీకొట్టిన కారు

● వ్యక్తికి తీవ్ర గాయాలు

నర్సాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ప్రధాన చౌరస్తా వద్ద సిగ్నల్ వద్ద ఆగి ఉన్న బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కౌడిపల్లి మండలం తుంకి గ్రామానికి చెందిన రమేష్‌గా గుర్తించారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలోని ఓ ప్రైవేటు కంపెనీలో విధుల కోసం బైక్‌పై వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. సిగ్నల్ పడటంతో బైక్ ఆపిన రమేష్‌ను, వెనుక నుంచి నిర్లక్ష్యంగా కారు నడుపుతూ వచ్చిన డ్రైవర్ వేగంగా ఢీకొట్టాడు. దీంతో రమేష్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కారులో ఉన్న ఇద్దరూ మద్యం సేవించి ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

185 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

కొల్చారం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కొల్చారంలోని పోతంశెట్టిపల్లి టీ జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మెదక్ జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు పోతన్ శెట్టిపల్లి గ్రామ పరిధిలోని ఎడుపాయల టీ-జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో డీసీఎంలో 370 బ్యాగుల్లో 185 క్వింటాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ బియ్యాన్ని కుల్చారం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు అమర వీరుల త్యాగాలు వృథా కావు

● మెదక్ ఎస్పీ శ్రీనివాస్‌రావు



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు

మెదక్ అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల త్యాగాలు వృథా కావని జిల్లా ఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సంస్మరణ వారోత్సవాల్లో భాగాంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటారన్నారు. రక్తదాన శిబిరంలో 99 యూనిట్లు రక్తం సేకరించి. 80 యూనిట్ల రక్తం నిలోఫర్ ఆసుపత్రికి, 19 యూనిట్లు మెదక్ బ్లడ్ బ్యాంకు తరలించినట్లు అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్ ద్వారా రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారో అడిగి తెలుసుకున్నారు. పది రోజుల్లో వెయ్యి దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్టీవోలు, తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

కొడుకు తిట్టాడని వృద్ధురాలు ఆత్మహత్య

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొడుకు మందలించాడని వృద్ధురాలైన తల్లి ఆత్మహత్య చేసుకున్నది. వివరాల్లోకి వెళ్లితే హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన బోడ కనకవ్వ (75)కు ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నాడు. శుక్రవారం రాత్రి ఆమెకు, తన కొడుకుకు గొడవ జరిగింది. ఈ విషయంలో కుమారుడు తల్లిని తిట్టాడు. దీంతో మనస్తాపం చెందిన కనుకవ్వ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పెద్ద కుమార్తె సుగుణవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మారెడ్డి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కనకవ్వ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



దత్తు (ఫైల్)

మనూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే కంచె లేని బావిలో పడి మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం మాయికోడ్ గ్రామ శివారులో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన గుండుల దత్తు (40) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పనులు చేసుకునేవారు. దీపావళి పండుగ సందర్భంగా దత్తు గ్రామానికి వచ్చారు. పండుగ తర్వాత మేనత్త ఇంటికి జహీరాబాద్ వెళ్లిన దత్తు, శనివారం ఉదయం తిరిగి మాయికోడ్ గ్రామానికి వస్తుండగా రోడ్డు పక్కనే కంచె లేకుండా ఉన్న బావి వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ క్రమంలో బైక్ పక్కకు పడగా, దత్తు బావిలో పడిపోయాడు. బావి పక్కన బైకు, చెప్పులు ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా, సాయంత్రం అతని మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి బాబన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపారు.

కంచె లేకపోవడంతోనే..

మనూరు నుంచి మాయికోడ్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఈ బావికి కంచె లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదాలు జరుగకముందే కంచె ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ నిండు ప్రాణం బలి అవడానికి ఇదే కారణమని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

పేలిన గ్యాస్ సిలిండర్

● వంటగదిలోని వస్తువులు దగ్ధం



దగ్ధమైన వస్తువులు

గజ్వేల్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో పెను ప్రమాదం తప్పింది. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన మరియాల వీరేశం గజ్వేల్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం వీరేశం ఇంట్లో పూజ గదిలో దీపాలు వెలిగించే సమయంలో సిలిండర్ పేలడంతో మంటలు వంటగదికి వ్యాపించాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమయానికి మంటలను ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు కానీ, వంటగదిలోని వస్తువులు దగ్ధమయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

భర్త వేధింపులు.. గృహిణి అదృశ్యం



సౌజన్య

పటాన్‌చెరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపుల కారణంగా ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్న సౌజన్య శుక్రవారం మధ్యాహ్నం సమయంలో పటాన్‌చెరు బస్టాండులో ఉన్నానని తన తండ్రి సుభాష్‌కు ఫోన్ చేసింది. భర్త శ్రీకాంత్ తాగి వచ్చి వేధిస్తున్నాడని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం దక్కలేదు. ఆమె తమ్ముడు అరవింద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

డ్యూటీకి వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్..



సైమన్

పటాన్‌చెరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్లిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం, పటాన్‌చెరు శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటున్న సైమన జీడిమెట్ల డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అక్టోబరు 22న డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య నాగలక్ష్మి ఫోన్ చేయగా, రేపు మధ్యాహ్నం వస్తానని సమాధానం ఇచ్చారు. బుధవారం సాయంత్రం కూడా ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ అయింది. అనంతరం జీడిమెట్ల డిపో మేనేజర్ అంజనేయులుకు ఫోన్ చేయగా, మూడు రోజులుగా డ్యూటీకి రావడం లేదని తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

10 కేజీల ఎండు గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు, గంజాయి

పటాన్‌చెరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రవాణా చేస్తున్న 10 కేజీల ఎండు గంజాయిని పట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర ఉస్మానాబాద్‌కు చెందిన సంతోష్ మధుకర్ చవాన్ శుక్రవారం సాయంత్రం తెల్లాపూర్ పురపాలక పరిధిలోని ముత్తంగి ఔటర్ సర్వీస్ రోడ్డుపై మోటారు సైకిల్‌పై ప్రయాణం చేస్తుండగా పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం ఖుర్దా గ్రామంలో సురేష్ బేహార్ వద్ద కొనుగోలు చేసిన కేజీల ఎండు గంజాయి, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సంతోష్ మధుకర్ చవాన్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు

● 110 లీటర్ల కల్లు పారబోత, నలుగురిపై కేసు నమోదు



కల్లును పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

అల్లాదుర్గం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా జాతీయ రహదారులపై అక్రమంగా కల్లు విక్రయాలు జరుపుతున్న కల్లు వ్యాపారులపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ రాజేశ్ తెలిపారు. అనుమతులు లేకుండా కల్లు విక్రయాలు జరుపుతున్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో కలిసి ఈ దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న 110 లీటర్ల కల్లును పారబోసి, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా కల్లు విక్రయాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



తాటికల్లును వంచుతున్న గీతాకార్మికుడు

Sunday Special

పేరెట్టి ముద్దుగా పిలిచెట్టు

తాటిచెట్లకు ఆసక్తికర పేర్లు

గీత కార్మికులు, కల్లుప్రియుల వినూత్న నామకరణ సంస్కృతి

రుచి, ఆకృతి, స్థలాన్ని బట్టి విభిన్న నామధేయాలు

పటేల్‌తాడు, కోడెనాగు, బంగారు తీగ.. ఎన్నో పేర్లు

దుబ్బాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆ చెట్టు కల్లు ముట్టాలంటే పటేల్‌తో పోటీపడాలి.. కోడెనాగు చెట్టు కల్లు తాగితే బుసలు కొట్టాల్సిందే.. బంగారు తీగ కల్లు తాగితే బొంగరంలా గిర్రున తిరగాలి... ఇవి తాటి చెట్లకు రుచి, ఆకృతి, స్థలం ఆధారంగా గౌడన్నలు(గీత కార్మికులు), కల్లు ప్రియుల్లో సాధారణంగా వాడుకలో ఉన్న మాటలు. ఇందులోని బంగారు తీగ, కోడెనాగు అంటే తాటిచెట్లకు ముద్దుగా వారు పెట్టుకున్న విభిన్నమైన పేర్లు. ఇవే కాదు ఇంకా చాలా చాలా పేర్లతో వాటిని పిలుస్తుంటారు. ప్రతీ తాటి చెట్టు వెనుక ఒక పేరు, ఒక చరిత్ర, ఒక రుచి దాగి ఉంది. వాటి ఆధారంగా పెట్టిన పేర్లు గీత కార్మికులు, కల్లు ప్రియులు ఎక్కువగా ఉండే జిల్లాతో పాటు ఇతర చాలా ప్రాంతాల్లో వినిపిస్తుంటాయి. విభిన్నమైన నామకరణ సంస్కృతి కల్లుతో ముడిపడిన గీత కార్మికులు, కల్లు ప్రియుల ప్రత్యేకమైన అభిమానాన్ని, అనుబంధాన్ని తెలియజేస్తుంది.

పేర్లు పెట్టడానికి కారణాలు

తాటి చెట్లకు నామకరణం చేయడానికి అనేక అంశాలు దోహదపడుతున్నాయి.

● **యజమాని/స్థలం పేర్లు:** చెట్లను గుర్తించుకునేందుకు వీలుగా, భూస్వాముల పేర్లు, స్థలాల పేర్లను చెట్లకు పెట్టేవారు. గతంలో భూములు ఎక్కువగా దొరలు, పటేల్, పట్వారీ, కరణాల చేతుల్లో ఉండటం వల్ల, వారి వ్యవసాయ భూముల్లో పెరిగే చెట్లకు ఎక్కువ శాతం భూస్వాములే పేర్లు పెట్టారని తెలుస్తుంది. గీత కార్మికులు ముందుగా ఆ భూస్వాములకే 'సాక' (ముందుగా కల్లు పోసి) అందించి, ఆ తర్వాతే మిగిలిన కల్లును ఇతరులకు అమ్మేవారు. చెట్టుకు కొంత చొప్పన (రొక్కం) చెల్లించే వారు. దుబ్బాకలో పన్యాల దొరలు పాలించినందున వారి పేరు మీద పన్యాల తాడు, ఉమ్మారెడ్డి దొర తాడు, పటేల్ తాడు, దొరవారి తోటలో ఉంటే దీవార్ తోట తాళ్ల (దొరవారితోటగా మారింది) వంటి పేర్లు వచ్చాయి.

● **రుచి ఆధారంగా :** కల్లు రుచి అంటే తీపి, పులుపు, ఒగరుతో పాటు మత్తు ఎంతసేపు ఉంటుందనేది ఆధారంగానూ పేర్లు పెట్టారు. పొద్దుతో పాటే పొంగి, బుస్సలు కొట్టేలా మత్తుని చ్చేది తాటిచెట్టుకు కోడెనాగు, మత్తు ఎక్కువగా ఉండే అనిపించే చెట్టుకు పుట్టగడ్డ, తాగితే తిమ్మిరి వచ్చే కల్లు ఉండే చెట్టుకు తేలుతాడు అని రుచిని బట్టి వివిధ రకాలు పేర్లు వినిపిస్తూ ఉంటాయి.

● **ఆకారం, స్థలం ఆధారంగా :** చెట్టు ఆకృతి, అది పెరిగిన చోటును బట్టి కూడా పేర్లు పెడతారు. పుట్టమీద ఉన్న చెట్టును పుట్టగడ్డ తాడు కల్లు అని, పేదలు గుడిసెలు వేసుకున్న చోట ఉన్న చెట్టును గుడిసెకాడి కల్లు అని అంటారు.

● **సామాజిక వర్గం పేర్లు :** చెట్టు యజమాని పేరుతో పాటు, కులాల పేరుతో కూడా తాటి చెట్లను పిలిచేవారు. మంగళోళ్ల తాడు, బెస్తోళ్ల తాడు వంటివి కులాల పేర్లతో పిలిచే తాటి చెట్లు.

● **సినిమాల పేర్లు :** పాతకాలం సినిమాలపై ఉన్న క్రేజ్‌ను బట్టి కూడా కొన్ని చెట్లకు పేర్లు పెట్టేవారు. బాలనాగమ్మ తాడు, మాయల ఫకీర్ తాడు, ప్రేమదేశం తాడు, సత్యహరిశ్చంద్ర తాడు, సలీం అనార్కలీ తాడు.

ఆది దంపతుల నామధేయం

తాటి చెట్లలో ఆడ (పండు తాళ్ల), మగ (పోతు తాళ్ల) రకాలు ఉంటాయి. ఇవి కల్లు ఇచ్చే సమయం, నాణ్యతలో విభిన్నంగా ఉంటాయి. ఎక్కువగా కల్లునిస్తూ, ఆ చెట్టును నమ్ముకుని బతుకుతున్న వారికి ఆర్థిక భరోసానిచ్చే పండు తాడును పార్వతీ దేవి చెట్టు అని పిలుస్తుంటారు. పోతు తాడు చెట్టును పరమేశ్వరుడి చెట్టు అంటుంటారు. డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు రుచికరమైన కల్లును అమితంగా ఇస్తుంది. కల్లు ప్రియులు దీనిని బాగా ఇష్టపడతారు. పార్వతీపరమేశ్వరులను ఆది దంపతులుగా కీర్తించినట్లే, ఈ చెట్టు పక్కపక్కనే ఉండి, ఆది దంపతుల పేరున స్థిరపడ్డాయి.



తాడు.. బొత్త

తాటి చెట్లను సాధారణంగా వాడుక భాషలో తాడు, తాళ్ల, బొత్త అని పిలుస్తుంటారు. ఒకే చెట్టు కోసం ఇద్దరు గొడవ పడడంతో ఆ చెట్టును పంచాయితీ బొత్త అని అంటుంటారు. వ్యాపారం, దిగుబడి ఆధారంగా ఒక చెట్టు కల్లు దిగుబడి, దాని అమ్మకాల క్రేజ్‌ను బట్టి పేర్లు ఉంటాయి. ముంతెడు కల్లు పడితే మోకాళ్ల వరకు తిండనే అర్థంలో ఎక్కువగా కల్లునిచ్చి, బాగా అమ్ముడయ్యే చెట్లను బర్కత్ తాడు, బంగారు తీగ, మహాలక్ష్మి చెట్టు అని పిలుస్తారు. అలాగే కల్లు బాగా వచ్చే చెట్లను ముత్యం, పగడం, వజ్రం, బంగారు బిందె అని కూడా పిలుస్తుంటారు. మేఘాల రంగులో కల్లు ఇచ్చే చెట్టును ఇంద్రధనస్సు అంటారు.

బీజేపీ అధికారంలోకి వస్తే.. బీసీని సీఎం చేస్తాం

● బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ గాలిమాటలు

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మేరా యువభారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. మెదక్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ గాలి మాటలు చెబుతోందని, తమ పార్టీపై అర్థరహిత ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. బీసీ జనాభా ప్రకారం రాష్ట్ర కేబినెట్‌లో 10 మంది బీసీ మంత్రులు ఎందుకు లేరని ఆయన ప్రశ్నించారు. దేశంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు రిజర్వేషన్లు కల్పించింది బీజేపీయేనన్నారు. వీకర్ సెక్షన్‌కు గుర్తించింది కూడా తమ పార్టీయేనన్నారు. రాష్ట్రంలో ఎవరెంత ఉంటే వారికి అంత ఇవ్వాలనేదే తమ నినాదమన్నారు.

బస్సు ప్రమాదం కలిచివేసింది..

కర్నూలు శివారులో జరిగిన బస్సు ప్రమాద ఘటన కలిచివేసిందని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ప్రమాదంలో మెదక్ మండల పరిధిలోని శివ్వాయిపల్లి గ్రామానికి చెందిన సంధ్యారాణి, చందన మృతి చెందడం బాధకరమన్నారు. మృతదేహాలను గ్రామానికి తీసుకొచ్చేందుకు అక్కడి అధికారులతో మాట్లాడినట్టు ఆయన తెలిపారు. ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ఆర్టీఏ అధికారులు హడావిడి చేస్తారన్నారు. హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు నిత్యం వందల సంఖ్యలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు తిరుగుతున్నాయని, వాటిపై ఎలాంటి నియంత్రణ లేకపోడంతో ఘోర ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశంగౌడ్, ప్రధాన కార్యదర్శులు రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, సీనియర్ నాయకులు నందారెడ్డి, రమేష్‌గౌడ్, సిద్ధిరాములు, జిల్లా నాయకులు నాగరాజు, శివ, శ్రీపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి మూలం ఆయుర్వేదం

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్యానికి మూలం ఆయుర్వేదమేనని సీనియర్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. ధన్వంతరి జయంతి ఉత్సవాల్లో భాగంగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ, ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎన్ఆర్ ఆసుపత్రి సహకారంతో సంగారెడ్డి విద్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆమె జ్యోతి వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి భారతీయ ఆయుర్వేదం సంపూర్ణ పరిష్కారాలను సూచిస్తుందన్నారు. ఆయుర్వేద బ్రహ్మ ధన్వంతరి వారసత్వం కలిగిన నాయీ బ్రాహ్మణుల సేవలు నేటి సమాజంలో ప్రశంసనీయమని కొనియాడారు. సమాజంలోని ప్రతి వ్యక్తికి న్యాయ సేవలను అందించడం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ గౌరవ అధ్యక్షుడు దత్తాత్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, సభ్యులు రంజోల్ ప్రభు, పెంటయ్య, స్వాగత్, ప్రభు, శేఖర్, ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి సుకుమార్, రాజారాం, మోహన్, మహిళా విభాగం సభ్యులు సుధామణి, మల్లేశ్వరి, పద్మావతి, జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ నాగభూషణం, ప్రధాన కార్యదర్శి రాజారామ్, యూత్ గౌరవ అధ్యక్షుడు అంజనేయులు, అధ్యక్షుడు చరణ్, ప్రధాన కార్యదర్శి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, సభ్యులు హనుమంతు, అనిల్, వీరన్న, సత్యం, అంజయ్య పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మెదక్ కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా బస్సు ప్రమాదంలో మరణించిన మెదక్ మండల పరిధిలోని శివాయపల్లి సంధ్యారాణి, కూతురు చందన కుటుంబ సభ్యులను శనివారం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్‌రావు పరామర్శించారు. ఈ సంఘటన బాధాకరమని అన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి త్వరితగతిన పార్థివ దేహాలను స్వగ్రామానికి తెచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ చౌదరి, రమేష్, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు



చిలప్‌చెడ్ : వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలు



సిర్గాపూర్ సమీపంలో నీటి మునిగిన వరి పంట

చేతికొచ్చిన పంట నీటిపాలు

●భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం ● నీట మునిగిన పంటలు..

చిలప్‌చెడ్/నారాయణఖేడ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం చేతికొచ్చాక నీటి పాలైంది. శనివారం కురిసిన అకాల వర్షానికి చిలప్‌చెడ్ మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఆరబోసిన ధాన్యమంతా తడిసి ముద్దయింది. టార్పాలిన్ కవర్లు కుప్పలపై కప్పినా నీరు నిలవడంతో ధాన్యం తడిసింది. కోతకు వచ్చిన పంటలు చిత్తడిగా మారి కోయడానికి వీలుకుండా పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నారాయణఖేడ్‌లో ఒక వైపు ఎండ, మరో వైపు గంటకు పైగా కుండపోత వర్షం కురిసింది. దీంతో నిజాంపేట పరిసరాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. సిర్గాపూర్ మండల కేంద్రంతో పాటు పరిసరాల్లో పొలాలు చెరువులను తలపించాయి. ఇప్పటికే పత్తి, ఇతర పంటల్లో నష్టం వచ్చి దిగాలుతో ఉన్న అన్నదాతలకు తాజాగా వర్షానికి వరి పంటకు కూడా నష్టం వాటిల్లడంతో లబోదిబోమంటున్నారు.



నారాయణఖేడ్ పరిధిలోని నిజాంపేటలో నేలకొరిగిన వరి పైరు

చెట్టు కిందనే అంగన్‌వాడీ చదువులు

● భవనం లేక విద్యార్థుల అవస్థలు

● సామగ్రికి ప్రాథమిక పాఠశాల వంటగదే దిక్కు

మనోహరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలో చిన్నారులు సొంత భవనం లేక కొన్నేళ్లుగా ఆరుబయట చెట్టు కింద చదువు కొనసాగిస్తున్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని పర్కిబండ మదిర గ్రామం తుపాకులపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో 29 మంది విద్యార్థులు చదువుతున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీలో సుమారు 15 మంది పిల్లలు ఉన్నారు. గతంలో ఓ భవనంలో అంగన్‌వాడీని మూడేళ్లపాటు నడిపించారు. అది శిథిలావస్థకు చేరడంతో అంగన్‌వాడీని ప్రాథమిక పాఠశాలకు మార్చారు. పాఠశాల విద్యార్థులకే తరగతి గదులు సరిపోకపోవడంతో అంగన్‌వాడీ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. తప్పని పరిస్థితుల్లో పాఠశాల ఆవరణలోని చెట్టు కింద చాపలు వేసి అంగన్‌వాడీ చిన్నారులకు బోధన చేస్తున్నారు. వర్షం వస్తే తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాల తరగతి గదుల్లోకి తీసుకువెళ్తున్నారు. పాఠశాల వంటగదిలోనే అంగన్‌వాడీ సామగ్రి పెడుతున్నారు. గ్రామంలో ఎవరిని అద్దెకు గది అడిగినా అంగన్‌వాడీ కోసం ఇవ్వడం లేదని ఉపాధ్యాయురాలు శ్యామల తెలిపారు. గర్భిణులు, బాలింతల పిల్లలకు ఏఎన్ఎం వచ్చి సూదులు వేయడానికి కూడా చెట్టు కింద మట్టిలోనే కూర్చోవాల్సి వస్తుంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రభుత్వం విద్య కోసం కోట్లు ఖర్చు చేస్తున్నా, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ భవనం లేక మట్టిలో విద్యా బోధన చేయడం ప్రభుత్వాలకే సిగ్గు చేటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కలెక్టర్, యంత్రాంగం స్పందించి అంగన్‌వాడీ విద్యార్థులకు భవనం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



చెట్టుకింద చదువుకుంటున్న అంగన్‌వాడీ చిన్నారులు

మోర్గి వంతెనకు మోక్షం ఎప్పుడో?

● నాసిరకం పనులంటూ నిర్మించిన పిల్లర్లు కూల్చివేత...

● మూడేళ్లుగా ముందుకు సాగని పనులు

● రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు





అసంపూర్తిగా ఆగిపోయిన వంతెన నిర్మాణం పనులు(ఫైల్), తొలగించిన పిల్లర్లు

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య రాకపోకల సౌలభ్యం మెరుగుపరచాలనే ఆశయంతో చేపట్టిన మోర్గి వంతెన పనులు 'ఒక అడుగు ముందుకు. మూడు అడుగులు వెనక్కి' అన్న చందంగా తయారయ్యాయి. నిర్మించిన పిల్లర్లను నాణ్యతారహితంగా ఉన్నాయంటూ కూల్చివేయడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. నారాయణఖేడ్ నియోజకవర్గం గుండా మంజీరా నది ప్రవహిస్తుంది. నదికి అవతల వైపున కర్ణాటక రాష్ట్రం ఉండగా, మంజీరా నదిపై మోర్గి, చిల్లర్గి గ్రామాల మధ్య రెండు దశాబ్దాల క్రితమే వంతెన నిర్మించారు. నారాయణఖేడ్ నుంచి కర్ణాటకలోని బీదర్‌కు వెళ్లడానికి ఎక్కువ శాతం మంది ఈ రహదారిని ఉపయోగిస్తారు. పుల్‌కూర్తి, డప్పూర్ మీదుగా వెళ్తే ఖేడ్ నుంచి 50 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కానీ మోర్గి మీదుగా వెళితే కేవలం 35 కిలోమీటర్ల దూరమే కావడంతో వాహన చోదకులు ఇదే మార్గాన్ని ఎంచుకుంటారు.

రూ.6.32 కోట్లతో..

ఈ రోడ్డుపై రద్దీ పెరగడంతో కరస్‌గుత్తి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మోర్గి మీదుగా సరిహద్దు వరకు రోడ్డు అభివృద్ధి, హైలెవల్ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.6.32 కోట్లు మంజూరు చేసింది. 2022 మార్చి 26న అప్పటి మంత్రి హరీశ్‌రావు ఈ పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు పూర్తి అయినప్పటికీ, వంతెన నిర్మాణానికి సంబంధించిన పిల్లర్ల పనులను పూర్తి చేసి మిగతా పనులను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రాకపోకలు సాగించడానికి పక్కన తాత్కాలికంగా వేసిన డైవర్షన్ రోడ్డు కూడా అధ్వాన్నంగా మారింది. దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆరు నెలల క్రితం క్వాలిటీ కంట్రోల్ అధికారులు వంతెన పనులు నాణ్యతారహితంగా ఉన్నాయని, అందువల్ల నిర్మించిన పిల్లర్లను కూడా తొలగింపజేసి తిరిగి మొదటి నుంచి నిర్మించాలని స్థానిక పీఆర్ అధికారులకు సూచించారు. దీంతో రూ. కోటితో వెచ్చించి నిర్మించిన పిల్లర్లను లక్షలు ఖర్చుపెట్టి ఇటీవల తొలగింపజేశారు. కానీ పనులు మళ్లీ ప్రారంభించలేదు.ఈ పరిస్థితుల్లో రెండు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడడానికి ఉపయోగపడే ఈ వంతెన పనులు ఆలస్యం కావడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం.



మోర్గి సమీపంలో చేపట్టిన వంతెన నిర్మాణం పనులు నిలిచిపోవడంతో తాము అవస్థలకు గురవుతున్నాం. తమ గ్రామం నుంచి నారాయణఖేడ్‌కు రాకపోకలు సాగించడానికి ఈ వంతెన పైనుంచే ప్రయాణించాల్సి వస్తుంది.

- ధనరాజ్, మోర్గి గ్రామస్థుడు

త్వరలో టెండర్లు వేస్తాం

గతంలో నిర్మించిన పనులు నాణ్యతారహితంగా ఉన్నాయని క్వాలిటీ కంట్రోల్ అధికారులు సూచించడంతో వాటిని తొలగింపజేశాం. మళ్లీ నిర్మాణ పనుల కోసం టెండర్లు వేయడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. త్వరలో టెండర్లువ వేస్తాం.

- విద్యాసాగర్‌రెడ్డి, ఏఈ, పంచాయతీరాజ్

ఇంటర్వ్యూ

ఏడుపాయల గుడి మరమ్మతులకు రూ.1.50 కోట్లు మంజూరు చేయాలి

పావన్నపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మంజీర వరదల వల్ల ఏడుపాయల్లో దెబ్బ తిన్న ప్రాంతాలను మరమ్మతులు చేయడానికి రూ.1.50 కోట్లు మంజూరు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేసినట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం కావడంతో లక్షలాది భక్తులు దుర్గమ్మ దర్శనానికి తరలి వస్తుంటారని చెప్పారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా, వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.

సీనియర్ టీచర్లకు టెట్ తప్పని సరి అనడం సరికాదు

మునిపల్లి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీచర్లకు టెట్ తప్పని సరి అని అనడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వరగంటి అనురాధ అన్నారు. మునిపల్లిలో నిర్వహించిన మహాసభలకు శనివారం ఆమె హాజరై మాట్లాడారు. విద్యా చట్టంలోని సెక్షన్ 23ను సవరించాలని టెట్ పరీక్ష సిలబస్‌లో మార్పులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మునిపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మునేష్, నిరూప రాణి. నాయకులు ఆనంద్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గానుగాపూర్‌కు భక్తుల పాదయాత్ర

నారాయణఖేడ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):ఖేడ్ ప్రాంతానికి చెందిన పలువురు భక్తులు కర్ణాటకలోని గానుగాపూర్ పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలు దేరారు. పట్టణానికి చెందిన వెంకటరమణరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు వంద మంది భక్తులు శనివారం స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్ ఆశీస్సులు తీసుకొని పాదయాత్రగా బయలు దేరారు. 8 సంవత్సరాలుగా ఈ భక్తులు గానుగాపూర్ క్షేత్రానికి పాదయాత్ర చేస్తూ వెళ్లి దత్తాత్రేయుడిని దర్శించుకుంటున్నారు.

చిట్కుల్‌లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

చిలప్‌చెడ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల శాంతి భద్రతల దృష్ట్యా అధికారుల సూచనల మేరకు గ్రామాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింలు తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని కిరాణ షాపుల్లో మాదకద్రవ్యాలు, బాంబు స్క్వాడ్ తనిఖీ నిర్వహించామన్నారు.

గుండెపోటుతో వ్యాపారి మృతి

పావన్నపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ టింబర్ డిపో వ్యాపారి గుండెపోటుతో మరణించిన ఘటనపాపన్నపేట మండలంలో చోటు చేసుకుంది. మిన్పూర్ గ్రామానికిచెందిన టింబర్ డిపో వ్యాపారి వడ్ల సదాశివుడు (55) గుండె సంబంధిత ఇబ్బందులతో శనివారం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించాడు. పావన్నపేట మండలంలో గత 30 యేళ్లుగా వ్యాపారం చేస్తున్నారు. కొంత కాలంగా, ఆయన డయాలసిస్ చేసుకుంటున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు,కూతురు ఉన్నారు. కాగా సదాశివుని మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

కోహీర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ మిషన్ పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీ పైన వ్యవసాయ పనిముట్లు అందజేయడం జరుగుతుందని ఏవో నవీన్‌కుమార్ తెలిపారు. వ్యవసాయ పనిముట్లు అవసరం ఉన్న రైతులు తమ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీ మహిళ రైతులకు ఐదు ఎకరాల లోపు భూమిగల వారికి 50 శాతం సబ్సిడీ పైన వ్యవసాయ పనిముట్లు అందజేయడం జరుగుతుందన్నారు. మిగిలిన రైతులకు 40 శాతం సబ్సిడీ పైన పరికరాలు అందజేయడం జరుగుతుందన్నారు.

అత్యవసర సేవల్లో నిర్లక్ష్యం తగదు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : అత్యవసర సేవల్లో నిర్లక్ష్యం వహించరాదని జీవీకే-ఈఎంఆర్‌ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్‌జాన్ షాహిద్ సూచించారు. సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ఆవరణలో 108, 102 అంబులెన్స్ వాహనాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంబులెన్స్‌లో పరికరాల పనితీరును పరిశీలించారు.

గ్రామ సభను అడ్డుకున్న గ్రామస్థులు

మనోహరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమస్యలు కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు గ్రామ సభను అడ్డుకున్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో కార్యదర్శి రూపాగౌడ్ ఆధ్వర్యంలో మహత్మాగాంధీ గ్రామ సభను నిర్వహించారు. అయితే తమకు తెలియకుండానే గ్రామసభ నిర్వహిస్తున్నారని గ్రామంలోని కొందరు గ్రామ సభను అడ్డుకున్నారు. గ్రామంలో పలు మార్లు గ్రామస్తులు గ్రామ సమస్యలు ఉన్నాయని తెలిపిన కార్యదర్శి పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలోని జీపీకి సంబంధించిన లెక్కలు చూపాలని గ్రామస్థులు అడిగితే సమాధానం చెప్పలేదని మండిపడ్డారు

మక్తా వెంకటాపురంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

రేగోడు అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ఈ నెల 27న మండలంలోని మక్త వెంకటపురం గ్రామంలో హరేరామ హరేకృష్ణ మఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో దైవచింతన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హమ్మయ్య.. కొత్త బల్దియాలకు నిధులొచ్చాయ్..

రాష్ట్ర ప్రభుత్వం గత జనవరిలో కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్తమున్సిపాలిటీల పరిధిలో మౌలికవసతుల కల్పనకు ఇంతవరకు నిధులు మంజూరు చేయకపోవడం గమనార్హం. కాగా సంగారెడ్డి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసినవాటి పరిధిలో అభివృద్ధి పనులకు గాను ఒక్కో మున్సిపాలిటీకి రూ. 15కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్టు శనివారం సంబంధిత మున్సిపల్ కమిషనర్లు వెల్లడించారు. దీంతో ఆయా మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కోహీర్‌లోని ఓ కాలనీలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం

కోహీర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ కొత్త మున్సిపాలిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు రూ.15 కోట్ల నిధులను మంజూరు చేసింది. కోహీర్ పట్టణ ప్రజల కోరిక మేరకు మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న కోహీర్‌ను గత జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. అయితే మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నయా పైసా విడుదల కాలేదు. దీంతో కోహీర్‌లోని పలు కాలనీలలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. అంతేకాకుండా వీధిలైట్లు లేకపోవడం, తాగునీటి సమస్య, మురుగు కాలువలు తదితర సమస్యలతో పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులనుంచి రూ.15 కోట్ల నిధులను మంజూరు చేయడంతో కోహీర్‌లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లబిస్తుందని పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే టెండర్లు

కోహీర్ కొత్త మున్సిపాలిటీలో త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధుల నుంచి రూ.15 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా అందాయి. త్వరలోనే టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభిస్తాం.

- సుభాష్‌రావు, కోహీర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్

చేపట్టనున్న పనులు ఇలా..

తెలంగాణ రైజింగ్ విజన్ 2047లో భాగంగా విడుదలైన రూ.15 కోట్ల నిధులతో కోహీర్ పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కోహీర్ నూతన మున్సిపల్ భవన నిర్మాణంతో పాటు ఫర్నిచర్ కొనుగోలు, మురుగు కాలువలు, సీసీరోడ్ల వంటి నిర్మాణాలు చేయనున్నారు. అలాగే పట్టణంలో వీధి దీపాల ఏర్పాటు, చౌరస్తాల అభివృద్ధి తదితర పనులు చేపట్టనున్నారు.

అభివృద్ధికి నిధుల వినియోగం


అధికారులతో సమావేశమైన కమిషనర్

జిన్నారం, అక్టోబరు, 25 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం మున్సిపాలిటీకి ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులను మంజూరు చేసినట్టు కమిషనర్ వెంకటరామయ్య పేర్కొన్నారు. పట్టణంలో సమస్యలను గుర్తించి మౌలిక వసతుల కల్పన కోసం నిధులను వినియోగించనున్నట్టు తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా పైప్‌లైన్స్, సీసీ రహదారులు, భూ గర్భ డ్రైనేజీ పనుల నిర్వహణకు క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన పనులను గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ నరసింహరాజు, మేనేజర్ మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి


శివ్వంపేట: సీతారాం తండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుహాసినీరెడ్డి

శివ్వంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పంటను దళారుల అమ్మి మోసపోకుండా రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుహాసినీరెడ్డి పేర్కొన్నారు. శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొంతాన్‌పల్లి, ఉసిరికపల్లి, సీతారాంతండా, రత్నాపూర్, పిల్లుట్ల, అల్లిపూర్, శివ్వంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ సుహాసినీ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. సందర్భంగా రైతులకు తీసుకువచ్చిన ధాన్యం బస్తాలను తూకం వేశారు. కార్యక్రమంలో ఏవో లావణ్య, సీఈవో మధు యాదవ్, రమణ గౌడ్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

- **నర్సాపూర్:** నర్సాపూర్ మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ ఛైర్మన్ రాజుయాదవ్ పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ శ్రీనివాస్‌తో కొనుగోలు కేంద్రాల ప్రారంభం విషయమై చర్చించిన అనంతరం ఛైర్మన్ విలేకరులతో మాట్లాడుతూ పీఏసీఎస్ ఆధ్వర్యంలో 17 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా నర్సాపూర్, తూప్రాన్ డివిజన్ పరిధిలో మొక్కజొన్న పండించిన రైతుల కోసం నర్సాపూర్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించనున్నట్లు రాజుయాదవ్ తెలిపారు.

రైతులు ఇబ్బందిపడకుండా కొనుగోళ్లు

తూప్రాన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వానకాలం ధాన్యం కొనుగోలులో రైతులకు సమస్యలు రాకుండా కొనుగోళ్లు చేపట్టాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. శనివారం తూప్రాన్ తహసీల్దారు కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై జీపీవోలు, ఏపీఎంలు, సీసీలు, ఓబీలకు ప్రత్యేక శిక్షణ సమావేశం నిర్వహించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రలో రైతులకు కావలసిన సదుపాయాలు, అవసరాలు కల్పించాలని తెలిపారు.వరి కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.

నాణ్యత పాటించకుంటే చర్యలు


సంగారెడ్డిలోని కింగ్స్ ధాబా హోటల్‌లో పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సంగారెడ్డి రూరల్ అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాణ్యత ప్రమాణాలు పాటించని దాబా, హోటళ్లపై చర్యలు తప్పవని సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. సంగారెడ్డిలోని కింగ్స్ ధాబా హోటల్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హోటల్‌లో పరిశుభ్రంగా ఉంచాలని, శుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలని ఆదేశించారు. ఎవరైనా కుళ్లిన పదార్థాలు నిల్వ ఉంచి వినియోగిస్తే భారీ జరిమానాలు విధించడమే కాకుండా దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా షైన్ బావర్చి, పోతిరెడ్డిపల్లిలోని కింగ్స్, ఎంఆర్‌సీబీ కర్రీ పాయింట్, కింగ్స్ దాబా 2, అరేబియన్ మండి హోటల్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కుళ్లిపోయిన చికెన్‌ను గుర్తించి వారికి రూ. 40 వేలు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో శానిటరీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీసీవర్గాల అభివృద్ధికి జేఏసీల బలోపేతం


జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో బీసీ జేఏసీ కమిటీ నాయకులు

జహీరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి: గ్రామాలవారీగా బీసీ వర్గాల అభివృద్ధికి జేఏసీ కమిటీలను బలోపేతం చేద్దామని పలువురు బీసీసంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో బీసీసంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతు బీసీలందరు ఐక్యమత్యంగ ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలాలవారీగా కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్దగొల్ల నారాయణ, కొండాపురం నర్సింహులు, విశ్వనాథ్‌యాదవ్, అరుణ్‌కుమార్, వేణు,మహేష్, సంతోష్, వీరేశం, శేఖర్, మోహన్, విఠల్, రాచన్న, ఇమ్రాన్, పాండు, అనురాధగౌడ్, శంకర్, నౌబాద్‌జగన్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మెదక్ ఎమ్మెల్యే ఆర్థికసాయం


పాపన్నపేట: రామతీర్థంలో మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు

పావన్నపేట/మెదక్ కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో మృతి చెందినవారి కుటుంబాలను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు శనివారం పరామర్శించి ఆర్థికసాయం చెక్కులను అందజేశారు. పాపన్నపేట మండలంలోని లక్ష్మీనగర్‌కు చెందిన రాధాకిషన్ రోడ్డుప్రమాదంలో మరణించగా శనివారం దశదినకర్మ నిర్వహించారు. ఎమ్మెల్యే దశదినకర్మకు విచ్చేసి రాధాకిషన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చి, రూ.లక్ష ఆర్థికసాయం చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు. అదేవిధంగా రామతీర్థం గ్రామానికి చెందిన కన్నె బోయిన గంగారాం ఆరు నెలల క్రితం రాంపూర్ సమీపంలోని అనుము బండల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయనకు భార్య నాగమణి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, మల్లప్ప, ప్రశాంత్ రెడ్డి, వంతుల భూమన్న, ఆకుల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు. మెదక్ మండల పరిధిలోని పేరూరు గ్రామంలో స్నానం చేయడానికి వెళ్లి నీట మునిగి చింతకింది శ్రీ కృష్ణ, బీరయ్య ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే వారి కుటుంబాల పరామర్శించి, ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అందచేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలి


సాయిచరణ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు

రామచంద్రాపురం టౌన్ అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఘోర బస్సు ప్రమాదం నేపథ్యంలో అధికార యంత్రాంగం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ట్రావెల్ బస్సుల తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ నాయకుడు బాలగోని సాయిచరణ్‌గౌడ్ కోరారు. పటాన్‌చెరు నుంచి బెంగుళూరుకు బయలుదేరిన బస్సు కర్నూలులో అగ్నిప్రమాదానికి గురికావడం దురదృష్టకరమని, ప్రమాదం కారణంగా అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించడానికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందించాలని కోరారు. అదేవిధంగా బస్సుల్లో ఎగ్జిట్‌డోర్లు ఎక్కువ సంఖ్యలో పెట్టాలని సూచించారు. అత్యవసర తలుపులు ఎక్కడ, ఎలా తెరుచుకోవాలనే దానిపై బస్సు బయలుదేరే ముందే ప్రయాణికులకు వివరించే ప్రక్రియ చేపడితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి


ఎంజీ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్

పటాన్‌చెరు అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి వెంబడి ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నందున అంతర్గత రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ కోరారు. శనివారం జాతీయ రహదారి నుంచి మున్నూరుకాపుసంఘం హాలు వరకు రూ.1.4కోట్ల అంచనా వ్యయంతో జరుగుతున్న రహదారి పనులను పర్యవేక్షణ చేశారు. అనంతరం ఉపకమిషనర్ సురేష్‌కుమార్‌తో సమావేశమయ్యారు. అలానే ఛట్‌పూజకు శాంతినగర్, శ్రీరామ్‌నగర్, బాలాజీనగర్, ఆల్విన్‌కాలనీ, బండ్లగూడ ప్రాంతాల్లోని చెరువుల ఘాట్‌ల వద్ద జరుగుతున్న ఏర్పాట్లపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

హాస్టళ్లు, మైనార్టీ గురుకుల పాఠశాలల తనిఖీ

నారాయణఖేడ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్ఎల్. మధుసూదన్ శనివారం నారాయణఖేడ్ పట్టణంలో పలు వసతి గృహాలు, మైనార్టీ గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహాల్లో విద్యార్థుల హాజరు, భోజనం అందిస్తున్న తీరు తదితర విషయాలను తెలుసుకున్నారు. ఖచ్చితంగా మెను ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని, సిబ్బంది స్థానికంగా ఉండాలని సూచించారు. వెంట మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి విశ్వనాథం, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

కంగ్టి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజుల్‌పాడ్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో సత్తయ్య శనివారం పరిశీలించారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, ఏఈ రవి, మాజీ ఎంపీపీ మాధవ్‌రావు, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

సేవా భావం పెంపునకే జాతీయ సేవా పథకం



ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వర్

నారాయణఖేడ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చదువుతో పాటు సమాజంపై అవగాహన, సేవా భావాన్ని పెంపొందింపజేయడానికి జాతీయ సేవా పథకం దోహద పడుతుందని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని హన్మంత్‌రావుపేటలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వారం రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు పుండ్లిక్, మన్మథకిషోర్, ప్రోగ్రాం అధికారి ఓంప్రకాష్, అధ్యాపకులుతదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి



పట్టణంలోని ఓ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి కవితాదేవి

జహీరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అత్యవసరమని సీనియర్‌సివిల్‌జడ్జి, మండలలీగల్ సర్వీసెస్ ఛైర్మన్ జి. కవితాదేవి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని స్రవంతి జూనియర్‌కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకుంటూ, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలున్నాయని తెలిపారు. కోర్టుల ద్వారా ఉచితంగా న్యాయసేవా సహాయం పొందే విధానంపై అవగాహనను కల్పించారు. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తు, అవసరమైతే తోటివారికి తెలియజేయాలన్నారు. బాల్య వివాహం, బాలకార్మికులు ఎక్కడైనా ఉంటే 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్‌ఖన్నా, సందీప్‌కుమార్, ఉపాధ్యాయులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్‌వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి


మున్సిపల్ కమిషనర్ దశరథ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ సర్పంచ్ మురళి

గుమ్మడిదల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో సర్వే నంబర్ 261 లో ఉన్న గ్రామ శ్మశాన భూమిపై అనోరా పరిశ్రమ యాజమాన్యం అక్రమంగా ప్రహరీ నిర్మాణం చేపట్టిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు అన్నారం గ్రామ మాజీ సర్పంచ్ మురళి గుమ్మడిదల తహసీల్దార్ పరమేశం, కమిషనర్ దశరథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 261 లో గ్రామ ప్రజల ఉపయోగానికి కేటాయించిన శ్మశాన వాటికతో పాటు కేసీఆర్ కాలనీకి చెందిన మరో శ్మశాన భూమి కూడా ఉంది. అయితే పరిశ్రమ యాజమాన్యం ఈ భూములను సైతం ఆక్రమించి ప్రహరీ నిర్మాణం మొదలుపెట్టింది. అలాగే పక్కనే ఉన్న రైతుల భూములు, అసైన్డ్ భూములు కలిపి సుమారు 150 ఎకరాలకు పైగా గోడ నిర్మాణం కొనసాగిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ కాలనీలో వందకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయని, శ్మశానానికి వెళ్లే మార్గాన్ని కూడా మూసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన భూమిని పరిశ్రమ యాజమాన్యం ఆక్రమించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకొని, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సాకీ చెరువుకట్టపై ఛట్‌పూజకు ఏర్పాట్లు

పటాన్‌చెరు అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తర భారతీయులు అత్యంత పవిత్రంగా జరుపుకునే ఛట్‌పూజ పెద్దఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరులో 50వేల మంది ఉత్తరభారతీయులకు ఛట్ పూజలకు సంబంధించి 10లారీల చెరుకును పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉత్తర భారతీయులకు ప్రత్యేకంగా ఏటా ఛట్‌పూజ నిర్వహించుకోవడానికి సాకి చెరువు కట్టపై సూర్యదేవాలయంతో పాటు ఫంక్షన్‌హాలు నిర్మాణం చేపట్టనున్నామన్నారు. కాగా మున్సిపాలిటీల్లో విలీనం అయిన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తెల్లాపూర్ పురపాలక పరిధి పోచారం గ్రామంలో రూ.60లక్షల అంచనా వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణ పనులు, ఇంద్రేశం మున్సిపల్ పరిధి మహదేవ్‌పురం కాలనీలో మురుగు పైపులైన్ పనులు ప్రారంభించారు.

పిల్లల ఎదుగుదలలో అంగన్‌వాడీల పాత్ర కీలకం

జహీరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పిల్లల ఎదుగుదలలో అంగన్‌వాడీ సెంటర్‌లు కీలకపాత్రను పోషిస్తున్నాయని నియోజకవర్గ మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను ఏర్పాటుచేసి 50సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలోని శాంతినగర్, తదితరప్రాంతాల్లో సంబురాలు జరుపుకున్నారు. అందులో భాగంగా విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళాకాంగ్రెస్‌నాయకులు, అంగన్‌వాడి టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లులు రాక ఉద్యోగులు సతమతం: టీఎన్జీవో

మెదక్ అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వద్ద తాము దాచుకున్న సొంత డబ్బులు రాక ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సమస్యలతో సతమతమవుతున్నారని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల పెండింగ్ బిల్లులతోపాటు బకాయి పడ్డ ఐదు విడదత కరువు భత్యం విడుదల చేయడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రవేశ పెట్టిన తీర్మానాలను కార్యవర్గం ఆమోదింపచేసింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి అనురాధ, జిల్లా సహ అధ్యక్షుడు ఇక్బాల్‌పాషా, ఉపాధ్యక్షులు పణీరాజ్, ఫజులొద్దీన్, రఘునాథ రావు తదితరులు పాల్గొన్నారు.

అమర పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

అల్లాదుర్గం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్ర భద్రత కోసం అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని అల్లాదుర్గం సీ.ఐ. రేణుకారెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాల సందర్భంగా శనివారం అల్లాదుర్గంలో సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, 161వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై 2 కే రన్ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్.ఐ శంకర్, పెద్దశంకరంపేట ఎస్.ఐ ప్రవీణ్‌రెడ్డి, రేగోడ్ ఎస్ఐ పోచయ్య, టేక్మాల్ ఎస్ఐ రాజేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ప్రచారంలో చేగుంట కాంగ్రెస్ నాయకులు

చేగుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్‌కు మద్దతుగా జూబ్లీహిల్స్ పరిధిలోని షేక్ పేట్‌లో ఎన్నికల ప్రచారంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ సయ్యద్ ఉసాముద్దీన్, చేగుంట యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్‌కు ప్రజల మద్దతు ఉందని అధిక మెజార్టీతో గెలుపొందుతారని వారు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో రూ. కోట్ల విలువైన అభివృద్ధి పనులు జూబ్లీహిల్స్‌లో జరిగాయన్నారు. షేక్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం చేశామన్నారు.

నాలాలు, రోడ్లను అక్రమించి అడ్డదిడ్డంగా నిర్మాణాలు

(5వ పేజీ తరువాయి)

మారాయి. పట్టణంలోని రాంనగర్ మీదుగా మొగుడంపల్లి రోడ్డు వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారింది. అల్గోల్ చౌరస్తా-భరత్‌నగర్ రోడ్డు, బాగారెడ్డి విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై, అల్లీపూర్ చౌరస్తాలోని పెట్రోల్ పంపు వద్ద, రహ్మత్‌నగర్ వెళ్లే రోడ్డు.. ఇలా పట్టణంలోని పలు రహదారులు ఇరుకుగా మారాయి. భవాని మందిర్ నుంచి మాణిక్‌ప్రభు వీధి వరకు, బ్లాక్ రోడ్డు చౌరస్తా 8 ఎస్టీవో కార్యాలయం వరకు, ఐబీ గెస్ట్‌హౌజ్ నుంచి లతీఫ్ రోడ్డు, నాగులకట్ట రోడ్డు నుంచి గడీ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రోడ్లపై కబ్జాలు అధికమయ్యాయి. అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందం పట్టనట్లు వ్యవహరించడం వల్లే అక్రమాలకు అంతులేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై, నాలాలపై, మురుగు కాలువలపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగిస్తే వర్షపునీరు, మురుగునీరు సక్రమంగా ముందుకు వెళ్లే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు.